క్లుప్తంగా

ప్రకృతి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయం



గుంటూరు రూరల్: ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న రైతులకు పీజీఎస్ సర్టిఫికేషన్‌తో అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని కృషిభవన్‌లో ప్రకృతి వ్యవసాయం రైతులకు పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలు వివరించారు. ఈ పీజీఎస్ సర్టిఫికెట్ ద్వారా రైతులు పండించే పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో సరైన ధరలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి, జిల్లా వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిహరార్థన్, ఉత్తర కోస్తా జిల్లాల ప్రతినిధి వెంకటరావు, లక్ష్మి, మల్లేశ్వరి, డీఎల్‌పీఓ సత్యనారయణ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



పెదనందిపాడు: యువత క్రీడల్లో రాణించాలని సర్పంచి పి.శ్రీలక్ష్మి కోరారు. మండల పరిధిలోని నాగులపాడులో అంబేడ్కర్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారు ఎంచుకున్న క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎల్‌డీసీ టి.లక్ష్మి, అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు మామిడి అశోక్, జూపూడి నరేంద్ర, కొణిదెన అశోక్, టి.భరత్ పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ కేఏఫ్ పరదేశి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్ తన తల్లిదండ్రులు, సోదరుని జ్ఞాపకార్థం అందజేసిన రూ.30 వేలతో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో ప్రభుత్వ మహిళా కళాశాల రూ.20 వేలు, ఏసీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు అందుకున్నారు. బెన్నిసన్ స్పాన్సర్ చేసిన రూ.ఐదు వేలను తృతీయ బహుమతి రూపంలో ఏసీ కళాశాల పీజీ విద్యార్థులు గెలుపొందారు. డీఎస్పీ ఐజక్ ప్రభాకర్ స్పాన్సర్ చేసిన రూ.రెండువేల కన్సొలేషన్ బహుమతులను జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రజాసేవలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి డాక్టర్ ఎజ్రా విజయ్‌శేఖర్, డాక్టర్ మైఖేల్ వినయ తేజ, డాక్టర్ పీబీ శర్మ, డాక్టర్ దయానా సత్యలత, ప్రభాకర్, రాజశేఖర్, శాంతి ప్రియ రంజని, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

26వ తేదీ నాటికి పెండింగ్ అర్జీలు పూర్తి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో పెండింగ్ అర్జీలు ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా వచ్చే నెల 5న వస్తుందని, ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అందిన ఫిర్యాదులు, అర్జీలను ఈ నెల 26 నాటికీ పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్న బీఎల్ఓల వారిగా సమీక్షించి ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజరీ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఏఈఆర్ఓ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్ వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నుంచి జానీ బాషా, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, సీపీఎం నుంచి షేక్ ఖాసిం పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు, నూర్పిళ్లు

- మండలంలో పెరిగిన యంత్రాల వినియోగం
- రబీ సాగుపై రైతుల ఆశలు

చేబ్రోలు: అన్ని రంగాలతో పాటు వ్యవసాయ రంగంలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. విత్తనం నాటే దగ్గర నుంచి కుప్ప నూర్చి ధాన్యం ఇంటికి చేర్చే వరకు యంత్రాల వినియోగం తప్పనిసరి అయింది. సమయం, డబ్బు ఆదా అవుతండటంతో రైతులు యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు.

చేబ్రోలు మండలంలో 15 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు చేశారు. చేబ్రోలు, మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం, వడ్లమూడి, నారాకోడూరు ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవటంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. పంట చేతికి అందే దశలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడటంతో అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. దీంతో ఎకరానికి 40 నుంచి 45 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన రైతులకు సుమారు పది బస్తాల వరకు దిగుబడి తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొద్ది రోజులుగా వాతవరణ పరిస్థితులు అనుకూలించటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. హార్వెస్ట్ యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో పనులు పూర్తి చేస్తున్నారు. యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ పనులు ప్రస్తుతం 10రోజులకే పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తుంది.



చేబ్రోలు మండలంలో యంత్రాల సహాయంతో వరి కోతలు దృశ్యం

బహిరంగ మార్కెట్లో ఆశాజనకంగా ధాన్యం ధరలు

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రైతుల నుంచి 75 కిలోల ధాన్యం బస్తా రూ.1900 నుంచి రూ.2000 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర బస్తా కంటే మూడు నుంచి నాలుగు వందలు అధికంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో అపరాల సాగుపై ఆసక్తి

చేబ్రోలు మండలంలో ఎక్కవ మంది రైతులు రబీలో అపరాల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత కొన్నేళ్లుగా జొన్న పంటలను సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం సాగునీటి సమస్య కారణంగా అపరాలు సాగు చేసుకోవాలని అధికారులు గ్రామాల్లో ప్రచారం చేశారు. దీంతో పాటు పంట మార్పిడి కూడా మంచి ఫలితాన్ని ఇస్తుందని రైతులు భావిస్తున్నారు. మినుము, పెసర పంటలకు మార్కెట్లో మంచి ధర ఉండటం కూడా రైతులు అపరాలు సాగుపై మొగ్గు చూపటానికి కారణంగా తెలుస్తుంది.



ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న హార్వెస్ట్ యంత్రం

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం ఆరోగ్యాన్ని కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. 40వ డివిజన్ పెదపలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచి విలువైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవడం ద్వారా జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలను ఆర్థికాభివృద్ధి చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమం అభివృద్ధి రెండుకళ్ళుగా కృషి చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు, మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు, కార్పొరేటర్లు ఏరువ సాంబిరెడ్డి, బి.స్మితపద్మజ, క్లస్టర్ కన్వీనర్లు బండారు శ్రీనివాసరావు, ఏటుకూరి విజయసారథి, సర్పంచులు ఎ.వెంకట్, ఎస్.మాధవరావు, దొడ్డా రాంజీఅంబేడ్కర్, ఎ.జగన్‌మోహన్‌రెడ్డి, మిర్చియార్డు డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు(ఇంద్ర), ఆర్ అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, ఎం.నాగరాజు, టి.నాగేశ్వరరావు, డి.నాగరాజు, టి.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్న బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

రేపు ఉప్పలపాడు గ్రామంలో 'సంక్షేమ సంగమం'

బజరంగ్ నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని

పెదకాకాని: సంక్షేమ ఆంధ్ర రథసారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 21వ తేదీ పెదకాకాని మండలం, ఉప్పలపాడులో బజరంగ్ సంగమం ద్వారా నేత్రజ్యోతి కంటి వైద్య శిబిరం, మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా గుండె పరీక్షలు, దివ్యాంగ దర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేత్రజ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనంతరం వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు.

సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనలో ఆరోగ్యశ్రీ పథకం అద్భుతంగా పనిచేస్తుందన్నారు. ఇంటికే ఆరోగ్యం జగనన్నతో సాకారం. ఆరోగ్యశ్రీతో ఆయుష్మాన్‌భవ అంటూ స్వయంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ దీనిని సద్వినియోగం చేసుకునే అవగాహనను ప్రజలకు ఆచరణాత్మకంగా బజరంగ్ ఫౌండేషన్ శిబిరాల ద్వారా కల్పిస్తుందన్నారు. విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్య బృందాలను గ్రామాలకి రప్పించి గ్రామంలోనే మీ గుండె పదిలం కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలానే బజరంగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగ దర్శిని ద్వారా జన్మలో కాలు కింద పెట్టలేని తీవ్ర వైకల్యం, ఓ మనిషి సేవాగుణం ముందు మోకరిల్లి ఓటమిని అంగీకరించిందని చెప్పారు. ఆ బాధితుడు అడుగు ముందుకు పడటంతో అతని నైరాశ్యం పారిపోయిందన్నారు. ఎక్కడైతే సమస్య ఎక్కువగా ఉందో, రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి ఈ సేవా పరంపర యొక్క సత్ఫలితాలను గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో అధిక గ్రామాల్లో నిర్వహించిన అనూహ్య రీతిలో స్పందన లభించిందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ వివరించారు.



అంబటి మురళీకృష్ణ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నంబూరు వీవీఐటీలో సెమీక్రిస్మస్ వేడుకల్లో ప్రదర్శించిన గాడ్ ఈజ్ విత్ అజ్ నాటికలోని సన్నివేశం

పెదకాకాని: వివా, వీవీఐటీ సంస్థల్లో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పొన్నూరుకు చెందిన సువార్త బోధకుడు ఎస్.దేవరాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరులపై దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. సమాజానికి చేసే మంచి పనిని ప్రభువు ఎల్లప్పుడూ గమనిస్తూనే ఉంటాడన్నారు. క్రీస్తు బోధనలకు అనుగుణంగా మనిషి తన జీవితాన్ని మలచుకోవాలని కోరారు. మనిషి యొక్క వ్యసనాలు, పాపాలు నుండి రక్షించటానికి ప్రభువు మనిషి రూపంలో జన్మించాడని వివరించారు. క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు కేక్ కట్ చేసి విద్యార్థులకు అందించారు. చిన్నారులు ప్రదర్శించిన గాడ్ ఈజ్ విత్ అజ్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీస్తు గీతాలాపన, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వివా డైరెక్టర్ ఎల్‌టి కమాండర్ కేఏస్ రావు, వివా ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, జోతి మెటిల్లా, డాక్టర్ భక్తసింగ్ పాల్గొన్నారు.

కంతాస్ సంజీవని హాస్పిటల్‌లో...

పెదకాకాని: వేద సీడ్స్ సర్వమత సారాంశం ఒక్కటేనని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ అన్నారు. పెదకాకాని మండలంలోని రామచంద్రపురం గ్రామ పరిధిలోని కంతాస్ సంజీవని సైకియాట్రిక్ హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో తులసి ధర్మ చరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమను కలిగి ఉండాలని బోధించారని తెలిపారు. క్రైస్తవులకు హ్యాపీ, మేరీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేద సీడ్స్ ఆధ్వర్యంలో హాస్పిటల్ సిబ్బందికి క్రిస్మస్ కానుకలను అందజేశారు. రోగులకు, స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ కంతా జగదీష్, న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ నాగరాజు, పుల్లగూర చంద్రశేఖర్, కదరి గణేష్, తేలప్రోలు వెంకట్రావు, గాజుల సాయిరాం పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు



కంతాస్ సంజీవని హాస్పిటల్‌లో సెమీక్రిస్మస్ కేక్ కత్తిరిస్తున్న వేద సీడ్స్ ఈడీ తులసి ధర్మ చరణ్ తదితరులు



దాక్షిణ్యాలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం

దక్షిణ్యాలో..

గుంటూరు రూరల్: క్రీస్తు జన్మదినం ఎంతో పవిత్రమైన రోజు అని దాక్షిణ్య సంస్థ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ టీవీ రావు తెలిపారు. మంగళవారం స్వర్ణభారతినగర్లోని దాక్షిణ్య మానసిక వికలాంగుల పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మానవతా సేవా సమితి చైర్మన్ పావులూరి రమేష్, సెక్రెటరీ వై రావు, దాక్షిణ్య డైరెక్టర్ వై.పల్లవి, దాక్షిణ్య ప్రిన్సిపాల్ బి.అరుణశ్రీ పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

పొన్నూరు: పొన్నూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించునున్న మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని అన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

పొన్నూరు: పోలూరి పోతురెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన సామగ్రి దాతలు మంగళవారం అందజేశారు. మైక్ సెట్, బీరువాలు, అంగన్‌వాడీ పిల్లలకు అవసరమైన భోజనంప్లేట్లు, ప్రింటర్ మామిళ్లపల్లి మాజీ సర్పంచి లంకపోతు పిచ్చిరెడ్డి అందించారు. కార్యక్రమంలో పాములపాటి శైలజ నందిని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమావేశం నేడు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులతో పరిచయ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట రోడ్డులోగల హోటల్ అట్లాంటిస్ రిసార్ట్స్‌లో సాయంత్రం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, డివిజన్ కన్వీనర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి కృషి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన గుంటూరు అరండల్ పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటురు మహానగర వన సమారాధన కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసు, పదిర ఈశ్వరచారి, భరద్వాజ, భద్రయ్య, శివరామ బ్రహ్మం, కొటేశ్వరరావు పాల్గొన్నారు.

చలపతిలో మహిళల చదరంగం పోటీలు

గుంటూరు రూరల్: విద్యతోపాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్ కళాశాలల మహిళల చదరంగం పోటీలను మంగళవారం నగర శివారుల్లోని లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదరంగం వంటి క్రీడల ద్వారా విద్యార్థుల ఆలోచన మెరుగుపడి, ఏకాగ్రత మరింత పెరుగుతుందన్నారు. పోటీలలో జిల్లా వ్యాప్తంగా కళాశాలల నుంచి మొత్తం 7 టీంలు పాల్గొనగా వీరిలో గుంటూరు సెయింట్ ఆన్స్ కళాశాలకు మొదటి బహుమతి, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు ద్వితీయ బహుమతి, జేకేసీ కళాశాలకు తృతీయ బహుమతి, చలపతి ఫార్మసీ కళాశాలకు నాలుగో బహుమతి లభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏవీ రాఘవయ్య, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలతో కళాశాల యాజమాన్యం

యోగాసన పోటీలలో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని వీసీ పీ నాగభూషణ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (వైఎస్ఏ ఏపీ) నిర్వహించిన 4వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌లో కే సాయి క్రిష్ణ, చరణ్ గణేష్ రెడ్డి రిథమిక్ పెయిర్ యోగాసన విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. కట్టా రాజ్‌కుమార్, డీ వెంకట సాయి చైతన్య అనే విద్యార్థులు ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ.మృనాల్, జి.ఆనంద్ అనే విద్యార్థులు ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు మొదటి స్టాండ్‌బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు. పతకాలు సాధించి జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నాగభూషణ్

డాక్టర్ భవనం, డాక్టర్ అమర్‌నాథ్‌కు ఇన్నోవేటివ్ అవార్డులు

గుంటూరు మెడికల్: ఆధునిక వైద్య విధానాలతో వినూత్న చికిత్సా పద్ధతులతో బ్రెయిన్ సర్జరీల్లో అరుదైన ఆపరేషన్‌లు చేస్తూ బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు బ్రిందా హాస్పిటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఇన్నోవేటివ్ అవార్డు లభించింది. కేఎల్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ 17వ వార్షిక సమావేశం మంగళవారం నిర్వహించారు. రోగి మెలకువగా ఉండగానే రోగికి ఇష్టమైన సినిమాలు ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ అవేక్ సర్జరీలు చేసి అరుదైన రికార్డును డాక్టర్ శ్రీనివాసరెడ్డి సొంతం చేసుకున్నారు. అత్యంత అరుదైన బ్రెయిన్ ట్యూమర్‌లను గుర్తించి విజయవంతంగా ఆపరేషన్లు చేశారు. బ్రెయిన్ సంబంధిత అరుదైన ఆపరేషన్‌లను కొంతకలంగా చేస్తున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి ఇన్నోవేటివ్ అవార్డును అందజేశారు. ఇన్నోవేటివ్ అవార్డు అందుకున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి పలువురు న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు అభినందనలు తెలిపారు.

అమరనాథ్‌కు..

ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో వినూత్న చికిత్సా పద్ధతులతో అరుదైన ఆపరేషన్‌లు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్‌కు ఇన్నోవేటివ్ అవార్డు లభించింది. కేఎల్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ 17వ వార్షిక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమర్‌నాథ్ అవార్డు అందుకున్నారు. డాక్టర్ అమర్‌నాథ్ నిరంతరం ప్రయోగాలు చేస్తూ ఖరీదైన, ఆధునిక చికిత్సలను రోగులకు చేరువ చేస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. కోవిడ్ అనంతరం తుంటి అరుగుదల సమస్యతో బాధపడడాన్ని గుర్తించి అరిగిన, ఇన్‌ఫెక్షన్ సోకిన తుంటి భాగాన్ని రివర్స్ చేసి ఫెమరల్ రొటేషన్ ఆస్టియోటమి చికిత్స విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. కృతమ తుంటిని అమర్చకుండా సహజంగా ఉన్న తుంటిని అదే స్థానంలో ఉంచి చికిత్స చేసే విధానంతో ఎంతో మందికి మేలు చేకూర్చారు. అంతేకాకుండా మధుమేహం వల్ల దీర్ఘకాలికంగా మానకుండా వేధించే గాయాలను ప్లేట్‌లెట్ థెరఫీ ద్వారా తగ్గించేలా చికిత్స విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్లేట్‌లేట్ రిచ్ ప్లాస్మా థెరఫీ పరికరాన్ని తయారు చేసి సదరు పరికరంపై పేటెంట్‌ను కూడా సొంతం చేసుకుని రికార్డు సృష్టించారు.



అవార్డులు అందుకుంటున్న డాక్టర్ భవనం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్

జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి రామాంజిరెడ్డి

పెదకాకాని: బాలలందరూ జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి సాధించాలని గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు సూచించారు. పెదకాకాని మండలం, కొప్పురావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో మంగళవారం బాలలు, జీవన నైపుణ్యాలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ రామంజి రెడ్డి మాట్లాడుతూ బాలలకు రక్తహీనత వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. ఉపాధ్యాయిని జయశ్రీ మాట్లాడుతూ బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని చెప్పారు. బాల్యవివాహం చేయాలని తలంచితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈవ ప్రభాకర్, పీఈటీ మరియన్న, స్కూల్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది సంధ్యారాణి, రాజ్యలక్ష్మి, గ్రామ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి భవ్య శ్రీ, క్రాఫ్ కో–ఆర్డినేటర్స్ జివెంకయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలి

నగరంపాలెం: భావితరాలకు సహజ వనరులు అందించాలంటే ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ శాఖ టౌన్–1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ ఇతరత్రా అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ విలువైనదని వృథా కాకుండా కాపాడుకుందామని చెప్పారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపు ఆచరించాలని అన్నారు.